క్లుప్తంగా

నర్సారెడ్డి పరామర్శ



పరామర్శిస్తున్న నర్సారెడ్డి

ములుగు(గజ్వేల్): ములుగులో ఇటీవల మృతి చెందిన దాకోజి వెంకటాచారి కుటుంబ సభ్యులను గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి సోమవారం పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ కుటుంబ సభ్యులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. ఆయన వెంట నాయకులు రమేశ్‌రెడ్డి, సలీం, కడపల్ల కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డి, కొండు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ హైమావతికి ప్రసాదం అందజేత



కలెక్టర్ హైమావతికి ప్రసాదం అందిస్తున్న ఈఓ వెంకటేశ్

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయ ఈఓ వెంకటేశ్ కలెక్టర్ హైమావతిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్వామి వారి ప్రసాదం, చిత్రపటాన్ని అందించారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు క్యూ కాంప్లెక్స్, 50 వసతి గదులు, దాతల సహకారంతో నిర్మించబోయే 100 వసతి గదుల నిర్మాణ పనుల ప్రగతిని వివరించారు. ఆమె త్వరలోనే ఆలయాన్ని సందర్శిస్తానని తెలిపినట్లు ఈఓ చెప్పారు.

చిన్న బ్రహ్మయ్యకు జేఐటీ అవార్డు



అవార్డు అందుకుంటున్న చిన్నబ్రహ్మయ్య

మర్కూక్(గజ్వేల్): మండలంలోని దామరకుంట ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య తెలంగాణ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఈఓ వెంకటరాములు, ఉపాధ్యాయులు పాఠశాలలో సోమవారం అభినందించారు. ఎంఈఓ మాట్లాడుతూ అవార్డుతోపాటు ఐదు వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నారన్నారు.

రిజర్వేషన్ సవరించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని లింగుపల్లి సర్పంచ్ రిజర్వేషన్‌ను సవరించాలని ఆ గ్రామానికి చెందిన న్యాయవాది పల్లెటూరి ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లింగుపల్లిలో కేవలం మాల కులస్తులు మాత్రమే జీవిస్తున్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్‌ను జనరల్ మహిళకు కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. జనరల్ మహిళ రిజర్వేషన్‌ను సవరించి ఎస్సీ మహిళగా ప్రకటించాలని కోరుతూ సిద్దిపేట రెవెన్యూ డివిజనల్ అధికారి, పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ అధికారికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. రిజర్వేషన్‌ను సవరించకుంటే ఎన్నికను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాలు సాధించిన వారికి అభినందనలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదివి గ్రూప్–1, గ్రూప్–2 ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్–1 ఉద్యోగిగా ఆంజనేయులు, గ్రూప్–2 ఉద్యోగులుగా అనిల్, ఉపేందర్, రాజు, నరేశ్, శ్రీనివాస్, నవీన్ ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలు పొందినవారిని ఆదర్శంగా తీసుకుని యువత రాబోయే పోటీ పరీక్షలకు సిద్ధంకావాలని సూచించారు. అందుకు అవసరమైన అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని ఆయన తెలిపారు.

తహసీల్దార్ల బాధ్యత స్వీకారం

తొగుట(దుబ్బాక)/మద్దూరు(హుస్నాబాద్): తొగుట, దూల్మిట్ట తహసీల్దార్లుగా సమీర్ అహ్మద్ ఖాన్, ప్రవీణ్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. కోహెడ్ తహసీల్దార్‌గా పనిచేసిన సమీర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీకాంత్ బెజ్జంకికి వెళ్లారు. ఈ సందర్భంగా సమీర్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అలాగే దూల్మిట్ట తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించి మధుసూదన్ అక్కన్నపేటకు బదిలీపై వెళ్లగా మర్కూక్ నుంచి ప్రవీణ్ దూల్మిట్టకు వచ్చారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాన్నారు.



కుకునూరుపల్లిలో ప్రత్యేక రూపంలో బతుకమ్మ



దుబ్బాకలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సిర్సనగండ్ల పంచాయతీ వద్ద..



హుస్నాబాద్‌రూరల్: తోటపల్లిలో..



చిన్నకోడూరు(సిద్దిపేట): పెద్దకోడూరులో..

సందడిగా సద్దుల బతుకమ్మ

సద్దుల బతుకమ్మ సంబురాలు సోమవారం ఘనంగా జరిగాయి. అన్ని గ్రామాలు, పట్టణాలలో ఆడపడుచులు తీరొక్క పూలతో భారీ బతుకమ్మలను అందంగా పేర్చారు. మహిళలు, యువతులు రంగు రంగుల నూతన వస్త్రాలు ధరించి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు.



ఎల్లమ్మచెరువులో బోటు ప్రయాణం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



కొండపాక(గజ్వేల్): దుద్దెడలో..



సిద్దిపేటజోన్: క్యాంపు కార్యాలయంలో బతుకమ్మతో ఎమ్మెల్యే హరీశ్, శ్రీనిత దంపతులు



భారీ బతుకమ్మతో బీఆర్ఎస్ రాష్ట్ర నేత కత్తి కార్తీక



మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలో..



గజ్వేల్ మండలం అక్కారంలో..



కొమురవెల్లిలో..



జగదేవ్‌పూర్‌లో..



దుబ్బాకలో బతుకమ్మలను చెరువు వద్దకు తీసుకెళ్తూ..



దుబ్బాకలో బతుకమ్మను ఎత్తుకున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రక్కన ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

చినుకు పడితే చిత్తడి.. చిత్తడే

గ్రౌండ్ ఇలా.. ఆటలాడేదెలా?

- వాహనాల ట్రయల్‌రన్ కూడా అక్కడే
- బురదమయంగా మారిన మైదానం
- ఆందోళనలో క్రీడాకారులు



బురదమయంగా మారిన మినీ స్టేడియంలోగల మైదానం

గజ్వేల్‌రూరల్: ఆటలాడుకునేందుకు ఉన్న కొద్దిపాటి మైదానంలో క్రీడాకారులు నిత్యం తమ ఆటతీరుకు పదును పెట్టుకుంటుంటారు. ఇదే ఆవరణలో ఆర్‌టీఏ కార్యాలయం సైతం కొనసాగుతుండడంతో అక్కడే వాహనాల ట్రయల్‌రన్ జరుగుతుంటుంది. అయితే వర్షాలు కురుస్తుండడంతో ఆ మైదానమంతా ఆటలాడేందుకు వీలులేకుండా చిత్తడిగా మారింది. ఇది తూప్రాన్ రోడ్డు మార్గంలో గల మినీ స్టేడియం దుస్థితి.

నిత్యం క్రీడాకారులకు శిక్షణ

గత ప్రభుత్వం సుమారు రూ.25 లక్షలు వెచ్చించటంతో ఫుట్‌బాల్ ఆడేందుకు వీలుగా మైదానాన్ని తీర్చిదిద్దారు. దీంతో ఇక్కడ సమ్మర్ క్యాంపులతోపాటు టోర్నమెంట్‌లు కూడా నిర్వహించారు. అలాగే కొన్నేళ్లుగా నిత్యం క్రీడాకారులు ఫుట్‌బాల్ ఆటలో శిక్షణ పొందుతున్నారు. అదేవిధంగా ప్రతి మంగళవారం, శుక్రవారం ఆ మైదానంలోనే వాహనాల ట్రయల్‌రన్ నిర్వహిస్తున్నారు.

ఎవరికి చెప్పుకోవాలి?

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వాహనాల ట్రయల్‌రన్‌తో ఆ మైదానం మరింత చిత్తడిగా మారింది. దీంతో ఫుట్‌బాల్ ఆడేందుకు వీలు లేకుండా పోయింది. ఈ విషయాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియక క్రీడాకారులు ఆందోళ చెందుతున్నారు. క్రీడారంగానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం గజ్వేల్‌లోని మినీ స్టేడియంను క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చొరవ చూపాలని, ఆర్‌టీఏ కార్యాలయానికి మరో చోట స్థలం కేటాయించాలని క్రీడాకారులు, స్థానికులు కోరుతున్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ



యాదగిరిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవార ంనిర్వహించిన కార్యక్రమంలో నంగునూరు మండలానికి చెందిన ఐలేని యాదగిరి కాంగ్రెస్‌లో చేరారు. హరికృష్ణ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. బీసీల అభ్యున్నతికి పాటుపడ్డ తమ పార్టీ అన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందని చెప్పారు కార్యక్రమంలో నంగునూరు అధ్యక్షుడు తప్పెట శంకర్, పీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ ముత్యాల యాదగిరి, పీఏసీఎస్ డైరెక్టర్ కరెడ్ల వెంకటరెడ్డి, ఘనపురం రమేశ్, అనుముల జైపాల్‌రెడ్డి, ఘనపురం కరణ్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సేవలు గొప్పవి



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): పంచాయతీ కార్మికుల సేవలు చాలా గొప్పవని మాజీ సర్పంచ్ పబ్బతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఆయన పలువురు కార్మికులకు సోమవారం నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు పండుగలు సంతోషంగా జరుపుకోవాలన్నారు. కార్మికులకు ప్రతియేటా నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

వారికి ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వొద్దు

బీజేపీ నేత అశోక్‌గౌడ్



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

గజ్వేల్‌రూరల్: మతం మారిన వారికి ఎస్సీ, ఎస్టీ సర్టిఫికెట్లు జారీ చేయకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రావణ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ మతానికి సంబంధించిన కొందరు ఎస్సీ, ఎస్టీలు క్రిస్టియన్ మతంలోకి వెళ్ళి రిజర్వేషన్ ద్వారా సంక్షేమ పథకాలను పొందుతున్నారన్నారు. దీంతో అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు రాజు, శేఖర్, స్వామి, శ్రీకాంత్‌గౌడ్, చందు, అనిల్, నవీన్, లక్ష్మణ్, మహిపాల్, మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

సీఐ శ్రీను

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు చర్యలు చేపట్టినట్లు సీఐ ఎల్.శ్రీను చెప్పారు. స్థానిక గాంధీ సెంటర్ వంతెన నిర్మాణ ప్రాంతంలో ఏర్పడ్డ గుంతలను సోమవారం పూడ్చివేయించారు. కంకర నింపి జేసీబీ, రోడ్ రోలర్ సహాయంతో చదును చేయించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ పట్టణంలో కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కొత్త బస్టాండ్ నుంచి గాంధీ చౌరస్తా వరకు రోడ్డు ధ్వంసమైందన్నారు. దీంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారిందని, ప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకున్నామని చెప్పారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ నవీన్ తదితరులు ఉన్నారు.



గుంతలు పూడ్చివేయిస్తున్న సీఐ శ్రీను, ఎస్ఐ నవీన్

సరస్వతీ నమస్తుభ్యం..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. అన్ని గ్రామాలు, పట్టణాలలో ఆలయాలు, మండపాల వద్ద దుర్గమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించారు. మూలా నక్షత్రం సందర్భంగా చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.




కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



సరస్వతీమాతగా లలితా పరమేశ్వరి



గజ్వేల్‌రూరల్: దుర్గాదేవిగా మహంకాళి అమ్మవారు



చేర్యాల(సిద్దిపేట): ఒడిబియ్యంతో అమ్మవారు



చిన్నకోడూరు(సిద్దిపేట): రాముని పట్లలో దుర్గామతకు పూజలు



సిద్దిపేటలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు